తీర్మానాలు సరే కార్యచరణేది?

- సంవత్సరాలు గడుస్తున్నా అభివృద్ధి శూన్యం
- పడకేసిన ఎర్రకుంట అభివృద్ధి పనులు
- నిధులు లేకే పనులు నిలిపివేత: డిప్యూటీ అసిస్టెంట్ ఇంజినీర్ యాదయ్య

హైదర్షాకోట్ గ్రామంలోని ఎర్రకుంటపై పెరిగిన పిచ్చి మొక్కలు, ఎర్రకుంటపై అక్రమంగా వెలుస్తున్న డబ్బాలు

బండ్లగూడ, మార్చి 1: బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ఎర్రకుంటను అభివృద్ధి చేస్తామని గొప్పలు చెప్పిన అధికారులు పత్తా లేకుండా పోయారు. గ్రీనరీని ఏర్పాటు చేసి సర్వాంగా సుందరంగా తీర్చిదిద్దుతామని ప్రణాళికలు రూపొందించారు. పలు తీర్మానాలు కూడా చేశారు. ఇంత జరిగి ఎడాదిన్నర గడుస్తున్నప్పటికీ ఎలాంటి అభివృద్ధి పనులు చేపట్టక పోవడం విస్మయానికి గురిచేస్తోందని స్థానికులు వాపోతున్నారు. కార్పొరేషన్ పరిధిలోని ఎర్రకుంట ప్రధాన రహదారి ఆనుకుని ఉంది. దీనిని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తే ప్రజలకు సేద తీరేందుకు ఎంతో ఉపయోగపడుతుందని పేర్కొంటున్నారు. కాగా ఎర్రకుంట అభివృద్ధి కోసం జూన్ 2022లో ప్రజా ప్రతినిధుల సమక్షంలో తీర్మానం చేశారు. నాటి అంచన వ్యయం రూ.45లక్షలు ఉండగా 31లక్షలకు టెండర్‌ను కాంట్రాక్టర్ దున్నపోతుల మహేశ్ దక్కించుకున్నారు. పనులైతే ప్రారంభించారు.. కానీ మధ్యలోనే నిలిచిపోయాయి. ఇప్పటికైనా ఎర్రకుంటను అభివృద్ధి చేయాలని పరిసరప్రాంతాల ప్రజలు అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నారు.

అక్రణలకు గురవుతున్న ఎర్రకుంట...

ఎర్రకుంటపై ఎలాంటి అభివృద్ధి పనులు చేపట్టక పోవడంతో అక్రమణలకు గురవుతుందని స్థానికులు వాపోతున్నారు. అభివృద్ధి పనులు చేపడుతున్నామని ఫెనిసింగ్ వేసిన అధికారులు.. పత్తా లేకుండా పోవడంతో వారు ఆలోచనలో పడ్డారు. ఎర్రకుంట రోజు రోజుకూ అక్రమార్కుల చేతిలో కబ్జాలకు గురౌతున్నదని, అక్కడ అభివృద్ధి పనులను చేపడితే ఎర్రకుంటను కాపాడుకోవచ్చాని స్థానికులు అవేదన వ్యక్తం చేశారు.

నిధులు లేకే పనుల నిలిపివేత

బండ్లగూడ జాగీర్ మున్సిపల్ పరిధిలోని ఎర్రకుంట అభివృద్ధికి తీర్మానాలు చేశాం. అక్కడ సదరు కాంట్రాక్టర్‌తో కొంత వరకు ఫెన్సింగ్ వేయడం జరిగింది. కానీ నిధుల కొరతతో అభివృద్ధి పనులను నిలిపివేయాల్సి వచ్చింది.

– యాదయ్య, డీఈఈ

125 కిలోల గంజాయి స్వాధీనం

బండ్లగూడ, మార్చి 1: ఏపీ నుంచి హైదరాబాద్ మీదుగా మహారాష్ట్రకు తరలిస్తున్న గంజాయిని రాజేంద్రనగర్ ఎస్‌వోటీ పోలీసులు స్వాధీనం చేసుకొని నిందితుడిని అరెస్ట్ చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు.. వెంకన్న అనేవ్యక్తి ఏపీ నుంచి 125 కిలోల గంజాయిని తీసుకుని మహారాష్ట్రకు వెళుతున్నాడు. ఎస్‌వోటీ పోలీసులు హిమయాత్‌సాగర్ రోడ్డులో వాహనాల తనిఖీల్లో భాగంగా కారులో గంజాయి ప్యాకెట్లు ఉన్నట్లు గుర్తించారు. స్వాధీనం చేసుకుని కారుతో పాటు వెంకన్నను పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

వాహనాల తనిఖీలు..

ఖైరతాబాద్, మార్చి1: బెంగుళూరులోని రామేశ్వరం కేఫ్‌లో బాంబు పేలుడు ఘటనతో పోలీసులు అప్రమత్తమయ్యారు. పంజాగుట్ట పీఎస్ పరిధిలోని పలు ప్రాంతాలలో ఏసీపీ ఎస్.మోహన్‌కుమార్, ఇన్‌స్పెక్టర్ శోభన్ నేతృత్వంలో సిబ్బంది పలు వాహనాలను తనిఖీ చేశారు. వాహన పత్రాలు, ఇతర వివరాలను పరిశీలించారు.

సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలి

శంషాబాద్ రూరల్, మార్చి 1: ప్రజలకు డ్రైనేజీ ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నట్లు కౌన్సిలర్ జాంగీర్‌ఖాన్ తెలిపారు. శుక్రవారం శంషాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని 4వ వార్డులో వివిధ కాలనీల్లో డ్రైనేజీలు నిండిపోయి ప్రజలు ఇబ్బందులు పడుతున్నట్లు తెలుసుకున్న స్థానిక కౌన్సిలర్ జాంగీర్‌ఖాన్.. వెంటనే అక్కడి చేరుకొని శానిటేషన్ అధికారుల సహకారంతో వార్డులోని పలు కాలనీల్లో డ్రైనేజీలను క్లీన్ చేయించారు. కార్యక్రమంలో శానిటేషన్ అధికారి లక్ష్మయ్య, పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

కార్మికుల సంక్షేమాన్ని విస్మరించిన కేంద్రం

హిమాయత్‌నగర్, మార్చి 1: కార్మికుల సంక్షేమాన్ని విస్మరించిన కేంద్ర ప్రభుత్వానికి రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో కార్మికులు బుద్ధి చెప్పాలని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి బి.వెంకటేశం పిలుపు నిచ్చారు. శుక్రవారం హిమాయత్‌నగర్‌లోని ఎస్‌ఎన్ రెడ్డి భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కార్మికులు పోరాడి సాధించుకున్న హక్కులపై ఉక్కు పాదం మోపుతూ కార్పొరేట్ సంస్థలకు అనుకూలంగా కేంద్రం పనిచేస్తుందని ఆరోపించారు.

నాలా ప్రతిపాదనలు సిద్ధం చేయండి

పంజాగుట్ట శ్మశానవాటికలో పనులపై ఆరా తీస్తున్న జీహెచ్ఎంసీ కమిషనర్ రొనాల్డ్ రాస్

బంజారాహిల్స్, మార్చి 1: బంజారాహిల్స్ రోడ్ నం.10లోని సింగాడకుంట, నాయుడునగర్ బస్తీల్లో నాలా మీద పైకప్పు దెబ్బతిన్న ప్రాంతాల్లో పునర్నిర్మాణం కోసం ప్రతిపాదనలు సిద్ధం చేయాలని జీహెచ్ఎంసీ కమిషనర్ రొనాల్డ్ రాస్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం వెంకటేశ్వరకాలనీ కార్పొరేటర్ మన్నె కవితారెడ్డితో కలిసి సింగాడకుంట, నాయుడునగర్ బస్తీల్లో పర్యటించారు. నాలాకు రెండువైపులా ఆర్‌సీసీ కాంక్రీట్ వాల్ నిర్మించి శ్లాబ్ వేసేలా ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. అనంతరం పంజాగుట్ట శ్మశానవాటికలో పనులను పరిశీలించారు. జోనల్ కమిషనర్ వెంకటేశ్, ఎస్ఈ రత్నాకర్, ఈఈ విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలు, విద్యార్థినుల కోసం ఉచిత శిక్షణ కేంద్రం

ఉచిత కంప్యూటర్ శిక్షణ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మేయర్ గద్వాల్ విజయలక్ష్మి

బంజారాహిల్స్, మార్చి 1: పేద, మధ్యతరగతి మహిళలు, విద్యార్థినులకు వృత్తి నైపుణ్యాన్ని కల్పించేందుకు పీపుల్ ఫర్ అర్బన్ అండ్ రూరల్ ఎడ్యుకేషన్ (ప్యూర్) సంస్థ ఆధ్వర్యంలో బంజారాహిల్స్ రోడ్ నం.12లో ఏర్పాటు చేసిన ఉచిత కంప్యూటర్ శిక్షణ కేంద్రాన్ని జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, సంస్థ ఫౌండర్ శైలా తల్లూరి, డైరెక్టర్ అరుణతో కలిసి శుక్రవారం ప్రారంభించారు.

సైన్సే అన్నింటికీ మూలం

ఆధునిక సమాజంలో మంత్రతంత్రాలకు చోటులేదని, సైన్సే అన్నింటికీ మూలమని హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి చంద్రకుమార్ అన్నారు. శుక్రవారం మోతీనగర్ గౌతమి మోడల్ స్కూల్ లో రెండు రోజుల పాటు జరగనున్న ప్రగ్యాస్ ఎడ్యుకేషన్ ఎక్స్‌పో నిర్వహించారు. కార్యక్రమం లో పాఠశాల ప్రిన్సిపాల్ రవి పారిపల్లి, బిజినెస్ హెడ్ రాధికతోపాటు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రాష్ట్ర వ్యాప్తంగా ఓటరు అవగాహన

ఖైరతాబాద్, మార్చి 1: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఓటు హక్కుపై రాష్ట్ర వ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు సమాచార హక్కు పరిరక్షణ సమితి జాతీయ చైర్మన్ డాక్టర్ బొమ్మరిబోయిన కేశవులు తెలిపా రు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన పలు విష యాలను వెల్లడించారు. సమావేశంలో సమితి రాష్ట్ర కన్వీనర్, న్యాయవాది ఉషారాణి, హరిప్రసాద్, ప్రదీప్, శంకర్, శ్రీదుర్గా, రాం బాబు, రేణుక, ధనలక్ష్మి, నాగరాజు, మేఖల శ్రీహరి, వాసు పాల్గొన్నారు.

ఆధునిక కూరగాయల సాగు లాభదాయకం

అసిస్టెంట్ ప్రొఫెసర్ సంతోషిని

కూరగాయల నారును పరిశీలిస్తున్న అధ్యాపకులు , విద్యార్థులు తదితరులు

వ్యవసాయ యూనివర్సిటీ, మార్చి 1: దేశంలో వ్యవసాయ, అనుబంధ రంగాలకు అధిక ప్రాధాన్యత ఉందని ఆ రంగాన్ని మన మంతా ఎంపిక చేసుకోవడం అభినందనీయమని కొండా లక్ష్మణ్ తెలంగాణ రాష్ట్ర ఉద్యాన విశ్వవిద్యాలయం రాజేంద్రనగర్ కళాశాల అసిస్టెంట్ ప్రొ.సంతోషిని విద్యార్థులకు సూచించారు. శుక్రవారం ఆర్నమెంటల్ హార్టికల్చర్ కోర్సులో భాగంగా సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీ నర్సరీలను సందర్శించారు. ఆమె విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ.. దేశంలో ప్రతి మనిషికి పౌష్టిక ఆహారం అందాలంటే వ్యవసాయంతో పాటు ఉద్యాన విద్య అభ్యసించే ప్రతి విద్యార్థికి ప్రాధాన్యత ఉంటుందన్నారు. పీహెచ్‌డీస్కాలర్ ప్రశాంత్ ప్రయోగాత్మకంగా హైడ్రోఫోనిక్స్, ఏరో ఫోనిక్స్ విధానంలో ఆకుకూర మొక్కలను పెంచే విధానాన్ని విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్ష కేంద్రాన్ని పరిశీలించిన కలెక్టర్

పరీక్ష కేంద్రాన్ని సందర్శించి అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ శశాంక

బండ్లగూడ, మార్చి 1: ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షల్లో ఎలాంటి పొరపాట్లు జరగకుండా తగిన చర్యలు తీసుకోవాలని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ శశాంక అధికారులను ఆదేశించారు. శుక్రవారం రాజేంద్రనగర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ పకడ్బందీగా పరీక్షలు నిర్వహించాలన్నారు. పరీక్ష కేంద్రంలో విద్యార్థులకు ఇబ్బందులు రాకుండ మౌలిక వసతులను కల్పించాలన్నారు. విద్యార్థుల హాజరు శాతం గురించి చీఫ్ సుపరింటెండెంట్ మురళిని అడిగి తెలుసుకున్నారు.

గాలికుంటు వ్యాధి నివారణ టీకా వేయించాలి

పశువులకు టీకాలు వేస్తున్న పశువైద్యాధికారి డాక్టర్ ఉమాకాంత్

శంషాబాద్ రూరల్, మార్చి 1: పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు తప్పని సరిగా వేయించాలని మండల పశువైద్యాధికారి డాక్టర్ ఉమాకాంత్ సూచించారు. శుక్రవారం మండలంలోని కొత్వాల్‌గూడ, పెద్ద తూప్ర గ్రామాల్లో టీకాల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న టీకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో పాలమాకుల పశువైద్యాధికారి నరోత్తంరెడ్డి, సుధాకర్‌గౌడ్, సంపత్, నగేశ్, అంజయ్య, నాగలక్ష్మీ, జ్యోతి, దానయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

మణికొండ, మార్చి 1: ఉచిత వైద్య శిబిరాలను ఉపయోగించుకోవాలని వీఆర్ ఫర్ సహయోగ్ చారిటబుల్ ట్రస్ట్ మేనేజింగ్ డైరెక్టర్ అందె లక్ష్మణ్‌రావు, కోశాధికారి దిలీప్ కక్కడ్ కోరారు. శుక్రవారం మణికొండ మున్సిపాలిటీ అల్కాపూర్ టౌన్‌షిప్‌లోని నేతాజీపార్కులో ఈనెల 3న నిర్వహించే ఉచిత మెగా ఆరోగ్య శిబిర స్థలాన్ని కౌన్సిలర్ నవీన్‌కుమార్, మెడిక్యూర్ డయాగ్నాస్టిక్ మేనేజింగ్ డైరెక్టర్ తబ్రేజ్ హుస్సేన్, కాశీరాం, ఫస్ట్ కేర్ ఫార్మసీ ప్రతినిధులు అశ్విన్, శేఖర్‌రెడ్డిలతో కలిసి పరిశీలించారు.

ఆరోగ్య భద్రత పాటించని హోటళ్లపై కఠిన చర్యలు

అత్తాపూర్, మార్చి 1: అత్తాపూర్‌లోని వెంగమాంబ హోటల్‌లో జీహెచ్ఎంసీ కమిషనర్ ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఫుడ్ సేఫ్టీ అధికారులతో కలిసి హోటల్ నిర్వహణను పరిశీలించారు. చికెన్‌తోపాటు ఆహార పదార్థాలు కుళ్లిపోయి అపరిశుభ్రంగా దుర్గంధం వెదజల్లాయి. దీంతో అధికారులు కేసు నమోదు చేశారు. సర్కిల్ కమిషనర్ రవికుమార్ రూ.50వేల జరిమానా విధించారు. ఆయన మాట్లాడుతూ.. ప్రతిరోజు రెస్టారెంట్లలో జరుగుతున్న అక్రమాలపై దాడులు నిర్వహిస్తున్నామన్నారు. శుక్రవారం వెంకమాంబ హోటల్‌లో తనిఖీలు చేయగా, చికెన్‌తోపాటు పలు పదార్థాలు కుళ్లిపోయిన స్థితిలో ఉన్నాయన్నారు. మేనేజ్‌మెంట్‌ను ప్రశ్నించగా పొంతనలేని సమాధానాలు చెప్పారు. ఆరోగ్య భద్రత లేని హోటళ్లపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన స్పష్టం చేశారు.

నిద్రమాత్రలు మింగి వ్యక్తి ఆత్మహత్య

బండ్లగూడ, మార్చి 1: మద్యానికి బానిసైన డ్రైవర్ నిద్రమాత్రలు మింగి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ పులి యాదగిరి తెలిపిన వివరాలు.. అత్తాపూర్ రాంబాగ్‌లో నివాసం ఉండే సత్యానారాయణ(47)డ్రైవర్. ఇంట్లో ఎవరూ లేని సమయంలో మద్యం మత్తులో నిద్రమాత్రలు మింగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికుల సమాచారంతో మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురికి తరలించారు. మృతిడి భార్య ఇచ్చిన పిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపడుతున్నట్లు తెలిపారు.

ప్రభుత్వ బడుల అభివృద్ధికి దాతలు సహకరించాలి

మైలార్‌దేవ్‌పల్లి, మార్చి 1: ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి దాతలు తోడ్పాటు అందించాలని నవయువ యూత్ క్లబ్ అధ్యక్షుడు ఏర్వ కుమారస్వామి, ఉపాధ్యక్షుడు రమేశ్‌రెడ్డి కోరారు. మైలార్‌దేవ్‌పల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో టాయిలెట్స్, నీటి ఎద్దడి సమస్యలపై శుక్రవారం క్లబ్ ఆధ్వర్యంలో మరమ్మతు పనులను చేయించారు. కార్యక్రమంలో జగన్, నరేశ్ సాగర్, హెచ్ఎం రాంచందర్, కోట్ల నరహరి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

భవనం పైనుంచి కిందపడి వ్యక్తి మృతి

బంజారాహిల్స్, మార్చి 1: భవన నిర్మాణ పనులను పర్యవేక్షిస్తున్న సైట్ సూపర్‌వైజర్ ప్రమాదవశాత్తూ కిందపడి మృతి చెందాడు. ఈ ఘటన జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. వనపర్తి జిల్లా కొత్తకోట మండలంలోని అమడబాకుల గ్రామానికి చెందిన బొమ్మిరెడ్డి శ్యాంసుందర్ రెడ్డి (46) ఏహెచ్‌కే ఇన్‌ఫ్రా సంస్థలో సూపర్ వైజర్‌గా పనిచేస్తూ.. కృష్ణానగర్‌లో ఉంటున్నాడు. జూబ్లీహిల్స్ రోడ్‌నం. 19లోని ప్లాట్ నంబర్ 425లో భవన నిర్మాణ పనులను పర్యవేక్షించే క్రమంలో రెండో ఫ్లోర్ నుంచి ప్రమాదవశాత్తు కిందపడిన అతడికి తీవ్ర గాయాలయ్యాయి. నిమ్స్‌కు తరలించగా.. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ప్రకటించారు. మృతుడి భార్య సునీత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్టు పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

మణికొండ, మార్చి 1: రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన నార్సింగి పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. కరీంనగర్‌కు చెందిన ఎం.కరుణాకర్(45) డీసీఎం డ్రైవర్. బుధవారం కరీంనగర్ నుంచి గ్రానైట్ లోడ్ డీసీఎంతో బయలుదేరి, హైదరాబాద్‌లోని మౌలాలిలో అన్‌లోడ్ చేశాడు. మౌలాలిలో అన్‌లోడ్ చేసిన తర్వాత.. ఖాళీ డీసీఎంతో గురువారం ఉదయం కోకాపేటలోని సినిమా టవర్స్‌కు వెళ్లాడు. స్క్రాప్ మెటీరియల్ లోడ్ చేయడానికి కూలీలు అందుబాటులో లేక పోవడంతో.. రాత్రి వరకు అక్కడే ఉండిపోయాడు. రాత్రి 8.30 గంటల సమయంలో భోజనానికి వెళ్తున్నానంటూ.. అతడి బావ రాజయ్యకు సమాచారమిచ్చాడు. రాత్రి 10 గంటల సమయంలో నార్సింగి మూవీ టవర్స్ ప్రాంతంలో ఓ వాహనం అతివేగంగా వచ్చి కరుణాకర్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనలో కరుణాకర్ అక్కడికక్కడే మృతి చెందాడు. పంచనామా అనంతరం మృతదేహాన్ని ఉస్మానియా మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కాంగ్రెస్ కౌన్సిలర్ పద్మారావు సస్పెన్షన్

మణికొండ, మార్చి 1: మణికొండ మున్సిపాలిటీ 7వ వార్డు కౌన్సిలర్ బి.పద్మారావును కాంగ్రెస్ అధిష్ఠానం సస్పెండ్ చేసింది. రంగారెడ్డి జిల్లా పార్టీ అధ్యక్షుడు చెల్లా నర్సింహారెడ్డి సస్పెన్షన్ ఆర్డర్ వివరాలను శుక్రవారం ఒక ప్రకటనలో విడుదల చేశారు. మున్సిపలిటీలో కాంగ్రెస్ పార్టీకి చెందిన కస్తూరి నరేందర్ చైర్‌పర్సన్‌గా ఉండగా ఆయనను తొలగించడానికి బీజేపీ, బీఆర్ఎస్ కౌన్సిలర్లతో కలిసి అవిశ్వాసం పెట్టారు. ఈ విషయమై పార్టీ తరపున షోకాస్ నోటీసు అందించినప్పటికీ, పద్మారావు ఈ నెల 22న అవిశ్వాసంలో పాల్గొని కాంగ్రెస్ పార్టీ చైర్మన్ నరేందర్‌కు వ్యతిరేకంగా ఓటు వేశారన్నారు. పార్టీ వ్యతిరేక కార్యక్రమాల్లో పాల్గొన్నందుకు పార్టీ ప్రాథమిక సభ్యత్వాన్ని రద్దు చేస్తూ తొలగించినట్లు పేర్కొన్నారు.

నీటి సమస్యలు రాకుండా పనులు పూర్తి చేయాలి

- జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల్ విజయలక్ష్మి
- బంజారాహిల్స్ డివిజన్‌లో రూ.1.40కోట్లతో పనులు ప్రారంభం

ఎన్‌బీటీనగర్‌లో పైపులైన్ పనులను ప్రారంభిస్తున్న మేయర్ గద్వాల్ విజయలక్ష్మి

బంజారాహిల్స్, మార్చి 1: వేసవిలో మంచినీటి సమస్యలు రాకుండా జలమండలి అధికారులు త్వరితగతిన పనులను పూర్తిచేయాలని జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల్ విజయలక్ష్మి ఆదేశించారు. బంజారాహిల్స్ డివిజన్ పరిధిలోని ప్రేమ్‌నగర్, ఎన్‌బీటీనగర్ బస్తీల్లో రూ.1.40కోట్ల వ్యయంతో జలమండలి ఆధ్వర్యంలో చేపట్టనున్న పైప్‌లైన్, సీవరేజ్ లైన్ పనులను శుక్రవారం మేయర్ ప్రారంభించారు. ప్రేమ్‌నగర్‌లో రూ.1.10 కోట్ల వ్యయంతో సమస్యలను తీర్చేలా పనులు చేపట్టామని తెలిపారు. బంజారాహిల్స్ రోడ్ నం.12లోని ఎన్‌బీటీనగర్‌లో రూ.30లక్షల వ్యయంతో మంచినీటి లైన్ పనులు చేపట్టామని వివరించారు. ఈ కార్యక్రమంలో జలమండలి అధికారులు, స్థానిక బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

రైతులకు వెన్నుదన్నుగా నిలిచిన ఘనత కేసీఆర్‌దే

మేడిగడ్డ బ్యారేజ్‌కు వెళ్లిన ఎమ్మెల్యేలు

మేడిగడ్డ బ్యారేజ్‌ను పరిశీస్తున్న రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్

మైలార్‌దేవ్‌పల్లి, మార్చి 1: మేడిగడ్డ బ్యారేజ్‌పై కాంగ్రెస్ చేస్తున్న దుష్ప్రాచారాన్ని తిప్పికొట్టేందుకు బీఆర్ఎస్ అధిష్ఠానం ఇచ్చిన పిలుపులో భాగంగా చలో మేడిగడ్డ బ్యారేజ్‌కు రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున బయలుదేరి వెళ్లారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రజలకు మేలు చేసేందుకు మాజీ సీఎం కేసీఆర్ ప్రాజెక్టులు నిర్మిస్తే.. కాంగ్రెస్ రాజకీయ లబ్ధికోసం వాస్తవాలను ప్రజలకు తెలియజేయకుండా దుష్ప్రాచారం చేస్తుందని విమర్శించారు.

ఎక్కువ దిగుబడి ఇస్తున్న రాష్ట్రాల్లో..

జూబ్లీహిల్స్, మార్చి 1: వ్యవసాయ రంగంలో విప్లవాత్మక మార్పులతో దేశంలోనే అత్యంత ఎక్కువ దిగుబడి ఇస్తున్న రాష్ట్రాల్లో ఒకటిగా తెలంగాణను తీర్చిదిద్దిన ఘనత బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్‌కే దక్కుతుందని జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు మాగంటి గోపినాథ్ పేర్కొన్నారు. శుక్రవారం బీఆర్ఎస్ ఎమ్మెల్యేల బృందంతో చలో మేడిగడ్డ ఆనకట్టను సందర్శించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అనేక సంస్కరణలతో రైతులకు వెన్నుదన్నుగా నిలిచిన ఘనత కూడా కేసీఆర్‌కే దక్కుతుందని పేర్కొన్నారు.

అధిక ఫీజులను అరికట్టాలి

ఉన్నత విద్యామండలి చైర్మన్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

హిమాయత్‌నగర్, మార్చి 1: కాకతీయ యూనివర్సిటీలో పరిధిలోని అన్ని పీజీ కోర్సులకు ప్రభుత్వం చెల్లించే ఫీజు రియింబర్స్‌మెంట్ కాకుండా అధిక ఫీజులను తీసుకోవాలని ఆదేశాలు జారీచేసిన వీసీపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ప్రతినిధి బృందం శుక్రవారం ఉన్నత విద్యామండలి చైర్మన్ లింబాద్రికి వినతిపత్రాన్ని అందజేసింది. ఏఐఎస్ఎఫ్ జాతీయ కార్యవర్గ సభ్యుడు ఇటికాల రామకృష్ణ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పుట్ట లక్ష్మణ్ మాట్లాడుతూ.. ప్రభుత్వం చెల్లించే ఫీజు రియింబర్స్‌మెంట్ సరిపడా రాలేదనే సాకుతో, అదనంగా ఫీజు చెల్లించాలని విద్యార్థులకు వర్సిటీ అధికారులు ఒత్తిడి పెంచి ఫీజులు చెల్లించని వారికి సర్టిఫికెట్లు ఇవ్వడంలేదన్నారు. కేయూ లో ఫీజుల దోపిడీని అరికట్టి విద్యార్థులకు న్యాయం చేయాలని కోరారు. ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గ్యార క్రాంతికుమార్, రఘు, గోపి, నరేశ్, సాయి, ఉమామహేశ్ పాల్గొన్నారు.

విద్యార్థి దశ నుంచే నాయకత్వ లక్షనాలు అలవర్చుకోవాలి

ఎన్నికలను పరిశీలిస్తున్న ఎంఈవో

మైలార్‌దేవ్‌పల్లి, మార్చి 1: విద్యార్థులు విద్యార్థి దశ నుంచే నాయకత్వ లక్షనాలు అలవర్చుకోవాలని రాజేంద్రనగర్ మండల విద్యాధికారి డి.రామిరెడ్డి సూచించారు. మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ గణేశ్‌నగర్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం లీడర్‌షిప్ మాక్ ఎన్నికలు నిర్వహించారు. 6 నుంచి 10వ తరగతి విద్యార్థులు మొత్తం 335 మంది ఓట్లు ఉన్నాయి. ఈ ఎన్నికల్లో 12 మంది విద్యార్థులు పోటీ చేయగా బన్నీగౌడ్ 76 ఓట్లతో విజయం సాధించారు. విజేతను ఈ సందర్భంగా అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ అమరుల పోరాటం వెలకట్టలేనిది

శంషాబాద్ రూరల్, మార్చి 1: ఎస్సీవర్గీకరణ కోసం అమరుల పోరాటం వెలకట్టలేనిదని ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకుడు మద్దిలేటి మాదిగ తెలిపారు. శుక్రవారం శంషాబాద్ పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద ఎస్సీ వర్గీకరణలో ప్రాణాలు కోల్పోయిన వారికి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు రత్నం, చిట్టిబాబు, యాదగిరి, జగ్గయ్య, సాయిలు, నారాయణ పాల్గొన్నారు.

ఉత్తమ ఇన్నోవేషన్లకు అవార్డులు

ఖైరతాబాద్, మార్చి1: ఆగస్త్యా ఇంటర్నేషనల్ ఆర్గనైజేషన్, సినాప్సిస్ సంస్థ సంయుక్తంగా ఖైరతాబాద్‌లోని విశ్వేశ్వరయ్య భవన్‌లో అన్వేషణ పేరుతో సైన్స్ అండ్ ఇంజినీరింగ్ ఫెయిర్ నిర్వహించారు. 150 ఇన్నోవేషన్లు ప్రదర్శించగా 43 ఉత్తమమైన ఇన్నోవేషన్స్ ఎంపికచేశారు. బహుమతులను ఐటీ హైదరాబాద్ డైరెక్టర్ డీకే లోక్‌నాథన్, ప్లానిటరీ సొసైటీ ఆఫ్ ఇండియా వ్యవస్థాపకుడు రఘునందన్ అందజేశారు. ఫౌండేషన్ ప్రతినిధులు శ్రీశైల్, బలరాం పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేస్తున్న కార్పొరేటర్

ఖైరతాబాద్, మార్చి 1: సోమాజిగూడ డివిజన్‌లోని ఎంఎస్‌మక్తా ప్రభుత్వ పాఠశాలలో కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమం శుక్రవారం జరిగింది. స్థానిక కార్పొరేటర్ వనం సంగీతయాదవ్ చేతుల మీదుగా 40 మంది లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రాహుల్, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు ఎస్కే అహ్మద్, ప్రధాన కార్యదర్శి పి. నాగరాజు, మాజీ కార్పొరేటర్ లక్ష్మినారాయణమ్మ, వనం శ్రీనివాస్‌యాదవ్, ఖాసీం, సలీం, ఆజామ్, ఫిరోజ్ తదితరులు పాల్గొన్నారు.

డ్రైవర్‌కు ఫిట్స్.. కారు ఢీకొని ముగ్గురికి గాయాలు

వెంగళరావునగర్, మార్చి 1: కారు నడుపుతుండగా డైవర్‌కు ఫిట్స్ రావడంతో.. అదుపుతప్పి ముగ్గురిని ఢీకొట్టిన సంఘటన మధురానగర్ పోలీసు స్టేషన్ పరిధిలో జరిగింది. మధురానగర్ కాలనీకి చెందిన మల్లి కార్జున్‌రెడ్డి (58) కొండాపూర్‌లోని రియల్‌ఎస్టేట్ సంస్థలో ఉద్యోగి. శుక్రవారం ఉదయం మధురానగర్ నుంచి బయలుదేరాడు. అకస్మాత్తుగా ఫిట్స్ రావడంతో డ్రైవింగ్‌పై నియంత్రణ కోల్పోయి పడిపోయాడు. అదే సమయంలో వెంకటేశ్ బైక్‌పై తన ఇద్దరు పిల్లల్ని పాఠశాలలో దిగబెట్టేందుకు వస్తుండగా.. కారు ఒక్కసారిగా బైక్‌ను ఢీకొట్టి అనంతరం వెల్లంకీ ఫుడ్స్ వద్ద ఉన్న హైమాస్ట్ విద్యుత్ పోల్‌ను బలంగా ఢీకొని కారు ఆగిపోయింది. ప్రమాదంలో వెంకటేశ్‌కు తీవ్రగాయాలు కాగా బైక్‌పై ఉన్న ఇద్దరు పిల్లలు స్వల్ప గాయాలయ్యాయి. మధురానగర్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.